సాక్షి కుమురం భీం

మంగళవారం, 14, ఫిబ్రవరి, 2023



చేతి నిండా 'ఉపాధి'

9లో▸

వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన 'ఉపాధి' పనుల బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. రైతులకు ఉపయోగపడేలా పనులు గుర్తించారు.



జీవ వైవిధ్యానికి ప్రతీక కవ్వాల్

కవ్వాల్ టైగర్‌జోన్ జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అరుదైన జంతువులకు జన్నారం అటవీ డివిజన్ ఆశ్రయమిస్తోంది. జంతువులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి.

10లో▸

గరిష్టం/కనిష్టం
32.4/14.2

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమశాతం తగ్గుతుంది. మధ్యాహ్నం వేడి పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెడ్పీ చైర్‌పర్సన్



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: రాజంపేటను ప్రత్యేక పంచాయతీగా గుర్తించి, ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా ప్రకటించిన నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపాలిటీ ప్రకటనతో జిల్లా కేంద్రం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చినందుకు సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్: మార్కెట్‌లో నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం కేంద్ర ప్రభుత్వ పౌరసరఫరాలు, వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఐ)పై జిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలతోపాటు ఐఎస్ఐ మార్కును తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బంగారం, వెండి వస్తువులపై ఐఎస్ఐ మార్కు లేనిపక్షంలో ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కల్తీ ఉంటే వినియోగదారుల ఫోరం ద్వారా నష్టపరిహారం పొందవచ్చన్నారు. ప్రభుత్వ సేవలు కూడా వినియోగం పరిధిలో ఉన్నందున అధికారులు, ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు రాకేశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. రోజువారీగా నిర్వహిస్తున్న స్లిప్ టెస్టుల్లో విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. హెచ్ఎం ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 15 నుంచి ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు డీఈవో అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున 34 రోజులపాటు అల్పాహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 2,846 మంది విద్యార్థులకు గాను రూ.14,51,460ల నిధులు విడుదలయ్యాయని వెల్లడించారు.

'హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలం'

దహెగాం(సిర్పూర్): హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. 2014లో ఏర్పడిన తెలంగాణ రూ.50 వేల మిగులు బడ్జెట్‌తో ఉండగా సీఎం కేసీఆర్ ప్రస్తుతం అప్పుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా గోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మించాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించారని, ఇక్కడి భూములు బొందలగడ్డగా మారయన్నారు. మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు అందడం లేదన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, జిల్లా మీటింగ్ కోఆర్డినేటర్ శ్రీశైలం, జిల్లా కార్యదర్శి సురేశ్, తాలుకా కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గోలేటిలో డిస్పెన్సరీ, గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులకు వినియోగిస్తున్న నాసిరకం ఇసుక

నాణ్యతకు తిలోదకాలు!

- సింగరేణి పనుల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- ఇష్టారీతిన నాసిరకం సామగ్రి వినియోగం
- ప్రమాణాలను గాలికొదిలేస్తున్నా పట్టించుకోని క్వాలిటీ కంట్రోల్ విభాగం

సాక్షి, ఆసిఫాబాద్: సహజంగా అవినీతికి దూరంగా.. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులనే నాణ్యత నిర్ధారణ విభాగం(క్వాలిటీ కంట్రోల్ సెల్)లో నియమిస్తారు. కానీ సింగరేణి బెల్లంపల్లి రీజియన్‌లోని ఆ విభాగానికి చెందిన అధికారుల విషయంలో అంతా తలకిందులుగా జరుగుతోంది. కంచే చేను మేసిన చందంగా వారు ప్రమాణాలను గాలికొదిలేస్తూ 'మామూళ్ల'పై పరిశీలన చేస్తున్నారు. పనుల పరీక్షలకు వెళ్లిన సమయాల్లో కనిపించే లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

భారీగా పనులు..

సింగరేణి యాజమాన్యం గనులు, కార్మిక వాడల్లో రూ.కోట్లు ఖర్చు చేస్తూ ఉద్యోగులు, కార్మిక కుటుంబాలకు వసతులు కల్పిస్తోంది. దీనిలో భాగంగా చేపట్టే ప్రతీ సివిల్ పనిని టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. ఆయా పనుల పర్యవేక్షణ బాధ్యత ఇంజనీరింగ్ అధికారులదే. ప్రమాణాలకు అనుగుణంగా జరిగాయా.. లేదా..? అని పరిశీలించాల్సింది క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులే. తుది బిల్లు మంజూరుకు వీరి నివేదిక తప్పనిసరి. దీనిని ఆసరాగా చేసుకునే సంబంధిత అధికారులు మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెస్టింగ్‌కు ఒకలా.. పనిలో మరొకలా

టెండర్ల ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పని ప్రారంభం కంటే ముందు వినియోగించే ప్రతీ మెటీరియల్‌ను క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపించి నాణ్యతను పరీక్షించుకోవాల్సి ఉంటుంది. పనుల కోసం ఉపయోగించే ఇసుక, ఇటుకలు, కంకర వంటి మెటీరియల్స్‌ను తప్పనిసరిగా క్వాలిటీ చెకింగ్ కోసం పంపిస్తారు. పరీక్షల్లో నాణ్యతగా ఉందని తేలిన తరువాతే ఆ మెటీరియల్‌తో పనులు చేపట్టాలి. అయితే అధికారులు అండదండలు పుష్కలంగా ఉండే కాంట్రాక్టర్లు పనుల్లో ఉపయోగించే మెటీరియల్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపించే వాటికి తేడా ఉంటోంది. సింగరేణి కాంక్రీట్ పనులు జరిగిన సమయంలోనే ఆ రోజు చేసిన పని పరిమాణానికి అనుగుణంగా క్వాలిటీ టెస్టింగ్ కోసం కాంక్రీట్ క్యూబ్‌లను తయారు చేయాలి. అయితే సైట్‌లో వినియోగించే సామగ్రి నాసిరకంగా ఉండడంతో కాంట్రాక్టర్లు టెస్టింగ్ కోసం పంపించే సీసీ క్యూబ్‌లను మాత్రం ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. వీటి కోసం సమపాళ్లలో ఇసుక, సిమెంట్, కంకర వేసి క్యూబ్స్‌ను రూపొందించి క్వాలిటీ విషయంలో సివిల్, నాణ్యత అధికారులను బురిడీ కొట్టిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

మచ్చుకు కొన్ని..

- వట్టివాగు సెకండ్ డైవర్షన్ పనుల్లో భాగంగా కైరిగూడ వద్ద నిర్మిస్తున్న ఊమ్ పైప్ బ్రిడ్జి పనులకు నిబంధనల ప్రకారం కొల్లూరు ఇసుకను వినియోగించాల్సి ఉండగా.. సదరు కాంట్రాక్టర్ మాత్రం స్థానిక చిర్రకుంట, వట్టివాగు ఇసుకను వినియోగించారు.
- గోలేటిలో డిస్పెన్సరీ పనులకు నాసిరకం ఇసుకనే వినియోగించారు. అయినా సివిల్ విభాగం అధికారులు, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు అడ్డుకోకపోవడం గమనార్హం.
- గోలేటిలో గెస్ట్‌హౌస్‌లో జరుగుతున్న పనుల్లో కూడా నాసిరకం రాజ్యమేలుతోంది. గోడలకు ఉపయోగించే ఇటుకలను స్థానికంగా లభించే ఇసుకతో తయారు చేశారు. వాస్తవానికి వీటిని ఫ్లైయాష్‌తో రూపొందించాల్సి ఉంది. కానీ అలా జరగలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

సింగరేణి బెల్లంపల్లి ఏరియాలో జరుగుతున్న సివిల్ పనులను సిబ్బందితో తనిఖీ చేయిస్తా. పనుల్లో నాణ్యత కచ్చితంగా పాటించాలి. సివిల్ పనుల్లో నాసిరకం సామగ్రిని వినియోగిస్తున్న తేలితే మాత్రం సదరు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, డీజీఎం, క్వాలిటీసెల్(సివిల్)

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు

ప్రయోగ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని డీఐఈవో శ్రీధర్‌సుమన్ అన్నారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన 'సాక్షి'కి వెల్లడించారు.

- 31 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు
- 4,176 మంది విద్యార్థులు
- ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు
- డీఐఈవో శ్రీధర్ సుమన్



శ్రీధర్ సుమన్, డీఐఈవో

సాక్షి: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో: జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ నెల 15 నుంచి మార్చి 2 వరకు పరీక్షలు నిర్వహిస్తాం.

సాక్షి: జిల్లా వ్యాప్తంగా ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంత మంది విద్యార్థులు హాజరు కానున్నారు?

డీఐఈవో: జిల్లా వ్యాప్తంగా మొత్తం 47 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. జనరల్ విద్యార్థుల కోసం 20 పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ వారి కోసం 11 మొత్తం 31 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. 4,176 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో జనరల్ విద్యార్థులు 2,713, ఒకేషనల్ విద్యార్థులు 1,463 మంది ఉన్నారు.

సాక్షి: ఎన్ని కళాశాలల్లో మెరుగైన ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయి?

డీఐఈవో: ప్రభుత్వ కళాశాలలు 11 ఉండగా, ఆసిఫాబాద్, తిర్యాణి, కెరమెరి, కాగజ్‌నగర్‌లో ప్రత్యేక ల్యాబ్‌లు ఉన్నాయి. మిగిలిన చోట విద్యార్థులకు నష్టం కలగకుండా క్లాస్‌రూంల్లోనే ప్రయోగ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

సాక్షి: విద్యార్థులను వార్షిక పరీక్షల కోసం ఏవిధంగా సిద్ధం చేస్తున్నారు?

డీఐఈవో: సంబంధించి ఇప్పటికే వందశాతం సిలబస్ పూర్తిచేశాం. రివిజన్ చేయిస్తున్నాం. గతేడాది ఇంటర్‌లో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాం. ఈ మేరకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

సాక్షి: ప్రయోగ పరీక్షలకు సంబంధించి టైమింగ్స్ ఎలా ఉండనున్నాయి?

డీఐఈవో: ప్రయోగ పరీక్షలు రెండు పూటలు ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తాం. ప్రతీ బ్యాచ్‌లో 20 మంది విద్యార్థులు ఉంటారు. ఫస్ట్ స్పెల్ ఈ నెల 15 నుంచి 23 వరకు, సెకండ్ స్పెల్ 24 నుంచి 25వ తేదీ వరకు, థర్డ్ స్పెల్ 26 నుంచి మార్చి 2 వరకు కొనసాగుతుంది. ఎన్‌క్రిప్టెడ్ ప్రశ్నపత్రాలను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్షకు అరగంట ముందు ఓటీపీ ద్వారా ఓపెన్ చేసుకోవాలి. అదే రోజు ఎగ్జామినర్లు మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సలహాలు?

డీఐఈవో: విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఆర్వో కృష్ణమూర్తి



శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావును జిల్లా అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, డీపీఆర్వో కృష్ణమూర్తి, సీపీవో రవీందర్, డీపీవో రమేశ్, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి మణెమ్మ, డీఆర్డీవో సురేందర్, ఇరిగేషన్ ఈఈ గుణవంత్‌రావు, అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీమ్‌రావు, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్, డీఐఈవో శ్రీధర్ సుమన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బ్యాంకర్లు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావు
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ బొర్కడే

ఆసిఫాబాద్: ప్రజా సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. బాధితులు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. పట్టా భూమి ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో నమోదైందని, భర్త చనిపోయిన నేపథ్యంలో తన పేరుతో పట్టా పాసుపుస్తకం జారీ చేయాలని కాగజ్‌నగర్ మండలం రాస్పల్లికి చెందిన అంబిలపు విజయ అర్జీ సమర్పించింది. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు దివ్యాంగుల కోటాలో డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని రెబ్బెన మండల కేంద్రానికి చెందిన మాచర్ల విఠల్ విన్నవించాడు. జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన భూమికి పరిహారం ఇప్పించాలని రెబ్బెన మండలం ఇందిరానగర్‌కు చెందిన గోగర్ల మల్లక్క వేడుకుంది. బెజ్జూర్ మండలం కొత్తచెరువులో ముంపునకు గురైన భూమికి పరిహారం ఇప్పించాలని జైహింద్‌పూర్ గ్రామస్తులు అర్జీ సమర్పించారు. తన ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని తన సోదరుడు సమాచారం లేకుండా ఇతరులకు విక్రయించాడని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన భక్తు తార దరఖాస్తు చేసుకుంది. భర్త పేరుతో ఉన్న భూమిని తన పేరుపై విరాసత్ చేయాలని కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన ఇప్ప వెంకటమ్మ విన్నవించింది. తన భూమిలో కొంత మంది దౌర్జన్యంగా ఇల్లు నిర్మించుకున్నారని, న్యాయం చేయాలని సిర్పూర్(టి) మండలం కంచరిపేటకు చెందిన కుడిమెత గంగారం అర్జీ సమర్పించాడు.

- టీనేజీలో ఉండేది ఆకర్షణే
- వివాహం అయ్యాకే ప్రేమించాలంటున్న యువత
- అప్పుడే ఎలాంటి ఇబ్బందులుండవు
- 'సాక్షి టాక్'లో ఛాత్రోపాధ్యాయుల అభిప్రాయం



'సాక్షిటాక్'లో మాట్లాడుతున్న డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు

పెళ్లి తర్వాతే.. ప్రేమ

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్/కైలాస్‌నగర్: ప్రేమ..రెండక్షరాల ఈ పదం కొందరికి ఆనందాన్ని, మరికొందరికి విషాదాన్ని మిగులుస్తోంది. ఏమీ తెలియని వయసులో ఆకర్షణే ప్రేమ అనుకొని జీవితాల్లో తడబడిన వారు కొందరైతే.. వైవాహిక బంధంతో ఏకమై తమ జీవితాలను నిలబెట్టుకున్న వారూ ఉన్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో 'పెళ్లికి ముందు ప్రేమ.. పెళ్లి తర్వాత ప్రేమ..' అనే అంశంపై 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం 'టాక్‌షో' నిర్వహించింది. ఇందులో మెజారిటీ ఛాత్రోపాధ్యాయులు పెళ్లి తర్వాతి ప్రేమనే మధురమని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ నేటి యువత ముందుకు సాగాలన్నారు. సమానత్వ భావనతో పరస్పరం గౌరవించుకోవాలని సూచించారు. సినిమాల్లో చూపినట్లు ప్రేమ ఉండదని, నిత్య జీవితంలో తప్పుదోవ పట్టకూడదన్నారు. ప్రేమ పేరుతో నేటి సమాజంలో దారుణాలు చోటు చేసుకుంటున్నాయని, ఈక్రమంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకొని ఆనందంగా గడపాలన్నారు.

టీనేజీలో ఉండేది ఆకర్షణే





టీనేజీ వయసులో ఏ విషయానికైనా ఇట్టే ఆకర్షితులవుతారు. ఆ సమయంలో ఆలోచనతో కాకుండా ఉద్వేగపూరితంగా వ్యవహరిస్తారు. ఈ కారణంగానే కలిగే ప్రతి ఫీలింగ్‌ను ప్రేమగా భ్రమ పడుతారు. ఈ సందర్భంలో మనం తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

– ఎస్. మనీషా, వైష్ణవి

తెలియని వయసులో ప్రేమ సరికాదు





అర్థం కూడా తెలియని వయసులో ప్రేమించి ఎంతో మంది అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వారు తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో కుటుంబాలకు దూరం అవుతున్నారు. అందుకే పెళ్లి తర్వాతే తమ ప్రేమను జీవిత భాగస్వామికి చూపించాలి. అప్పుడు కుటుంబ సభ్యులతో పాటు జీవిత భాగస్వామికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. జీవితం సాఫీగా సాగుతుంది.

– టి.ప్రవళిక, ఆర్. సౌజన్య

పెళ్లి తర్వాత ప్రేమే స్వచ్ఛమైనది



నా దృష్టిలో పెళ్లి తర్వాతి ప్రేమే స్వచ్ఛమైనది. మన పెద్దలు వెనుకా ముందు ఆలోచించి పెళ్లిళ్లు చేస్తారు. వారి అనుభవంతో కూడిన నిర్ణయాలు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. పెళ్లికి ముందు మనం తీసుకున్న నిర్ణయాల్లో పొరపాట్లు ఉండే అవకాశం ఉంది. వైవాహిక జీవితంలో ఒక్కటైన తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకొని ముందుకు సాగడం వల్ల ప్రేమ స్వచ్ఛంగా ఉంటుంది. జీవితం ఆనందంగా గడుపుతారు.

–ఎస్. సాయి దివ్యేశ్వరి, బి. లావణ్య

పెళ్లి తర్వాతే ప్రేమానుబంధాలు



పెళ్లికి ముందు ప్రేమ ఒక కాలక్షేపమే.. ఎంతో మంది యువత దీని వల్ల తమ భవిష్యత్‌ను కోల్పోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పెద్దలు నిశ్చయించిన పెళ్లితో ఎటువంటి అనర్థాలు ఉండవు. అందరి సమక్షంలో వివాహం జరగడం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకొని ముందుకు సాగుతారు. పెళ్లి తర్వాతే అనుబంధాలు, ఆప్యాయత అనురాగాలు ఉంటాయి. పెళ్లి తర్వాతి ప్రేమ కలకాలం నిలుస్తుంది.

– సీహెచ్. రక్షిత

తల్లిదండ్రులను మర్చిపోవద్దు



ప్రేమ అనే భావన గొప్పదే అయినా.. నేటి కాలంలో దాని అర్థాన్ని మార్చేస్తున్నారు. ప్రేమ అంటే ఓ అబ్బాయి అమ్మాయిని ప్రేమించడం.. అమ్మాయి అబ్బాయిని ప్రేమించడం కాదు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, గురువులను మనస్ఫూర్తిగా గౌరవిస్తూ ప్రేమించడం కూడా మర్చిపోకూడదు. కుటుంబాన్ని నిజంగా ప్రేమించిన వారే ఇతరులను కూడా గౌరవిస్తారు.

– రాహుల్

సంప్రదాయాలను గౌరవించాలి



మన సంస్కృతి, సాంప్రదాయాలను అందరూ గౌరవించాలి. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి నేటి యువత పెడదోవ పడుతున్నారు. ఈ రోజుల్లో ప్రేమ పేరుతో చాలామంది స్వలాభానికి వాడుకుంటున్నారనే విషయాన్ని యువత మర్చిపోవద్దు. తమ ఉద్వేగాలను నియంత్రించుకుంటూ వ్యక్తిత్వ నిర్మాణం చేసుకోవాలి.

– స్వర్ణలత, లెక్చరర్

ఆర్థిక స్థిరత్వం ఉంటేనే...



ఈ రోజుల్లో ఆర్థికంగా స్థిరపడి ఉంటేనే ఇష్టపడుతున్నారు. కానీ పెళ్లయిన తర్వాత వారి అలవాట్లు నచ్చకుండా తమ బంధాలను కొనసాగించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అవస్థలు పడుతున్నారు.

– ఆర్. రాణి

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

ఆసిఫాబాద్‌రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైన సంఘటన సోమవారం మండలంలోని మోతుగూడలో చోటు చేసుకుంది. మోతుగూడ గ్రామానికి చెందిన పిప్రె మనోహర్ ఇటీవల తన పంటచేలో నుంచి సేకరించిన పత్తిని ఇంట్లో నిల్వ ఉంచాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగడంతో పత్తికి నిప్పంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బిందెల సాయంతో మంటలు ఆర్పివేశారు. ఘటనలో రెండు క్వింటాళ్ల మేర పత్తి దగ్ధమైందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈనెల 9 నుంచి కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నలందా డిగ్రీ కళాశాలలో ముగ్గురు, మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన జోడె సావిత్రి బాయిపై సోమవారం అడవి పంది దాడి చేయడంతో గాయాలయ్యాయి. జోడె సావిత్రి బాయి చింతలమానెపల్లి శివారులోని పంట చేనులో పత్తి ఏరడానికి కూలి పనికి వెళ్ళింది. పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. తోటి కూలీలు కేకలు వేయడంతో అడవిపంది పారిపోయింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థినులు

నెన్నెల(బెల్లంపల్లి): సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్ ఆధ్వర్యంలో ఆదివారం మందమర్రిలో నిర్వహించిన ఐఎస్ఎల్ ఓపెన్ ఇన్విటేషన్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నెన్నెల కస్తూరిబా విద్యార్థినులు ప్రతిభకనబర్చి ఏడు బంగారు, ఒక వెండి పతకం సాధించారు. పతకాలు సాధించిన వైష్ణవి, రమాదేవి, అక్షయ, అంజలి, సంధ్యారాణి, పూజిత, శృతి, హర్షితలను పాఠశాల ఎస్‌ఓ కల్యాణి, సిబ్బంది పద్మ, పీఈటీ తిరుమల, సిబ్బంది అభినందించారు.

పలు రైళ్లు రద్దు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మీదుగా నడుస్తున్న పలు రైళ్లను ఈ నెల 15 నుంచి 24 వరకు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లోని వీరూర్, మాకూడి రైల్వే స్టేషన్ల మధ్య మూడో రైల్వేలైన్ నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో రద్దు చేసినట్లు తెలిపారు. కాజీపేట-బల్లార్ష, బల్లార్ష-కాజీపేట, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్-సింద్రాబాద్, హెచ్‌ఎస్ నాందేడ్-నిజామాబాద్, నిజామాబాద్-హెచ్‌ఎస్ నాందేడ్, కాచిగూడ-కరీంనగర్, కరీంనగర్-కాచిగూడ, పూర్ణ-ఆదిలాబాద్, కాచిగూడ-నిజామాబాద్, నిజామాబాద్-కాచిగూడ, కాజీపేట-సిర్పూర్‌టౌన్, బల్లార్ష-కాజీపేట, సిర్పూర్‌టౌన్-కరీంనగర్, కరీంనగర్-సిర్పూర్‌టౌన్, మధ్య నడిచే రైళ్లు రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ శివారులో మోటారు వైర్ తాకి ఎద్దు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు ఆకుల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పంటచేనులో మేత మేస్తుండగా కెనాల్ నుంచి చేనులోకి నీరు ఇచ్చే ఆయిల్ ఇంజన్ వైరును ఎద్దు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

నువ్వుంటే నా జతగా.. నేనుంటా ఊపిరిగా

ప్రేమ.. అనిర్వచనీయమైన అనుభూతి, ప్రేమ.. వెలకట్టలేని సంపద. నిస్వార్థమైన, నిజాయతీతో కూడిన ప్రేమ ఎంతో పవిత్రమైనది..శక్తివంతమైనది. ఈ ప్రపంచాన్నే ముందుకు నడిపించే భావోద్వేగమే ప్రేమ. ఏ బంధమైన వికసించాలన్నా..చిరకాలం నిలవాలన్నా ప్రేమ ఒక్కటే మార్గం. అది ఇద్దరు వ్యక్తుల మధ్య అయి ఉండవచ్చు.. లేదా కుటుంబం, సమాజం మీద అయి ఉండవచ్చు. నిజమైన ప్రేమ ధనంతో.. బలంతోనే దక్కించుకునేది కాదు. నిజమైన ప్రేమను నిజంగా ప్రేమించడం ద్వారానే జయించగలం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా మంది తమ నిజమైన ప్రేమతో జీవితాన్ని ఆనందమయం చేసుకున్నారు. ప్రేమను గెలిపించి.. పెళ్లి బంధంతో ఏకమై ప్రేమానుభూతులను ఆస్వాదిస్తున్నారు. నువ్వుంటే నా జతగా... నేనుంటా నీ ఊపిరిగా అంటూ దేహాలు వేరైనా మన ప్రేమ ఒక్కటే అంటూ ముందుకు సాగుతున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో కొంతమంది ప్రేమానుభూతులు వారి మాటల్లో..

valentines day special



చదువు అండగా నిలిచింది



నిర్మల్‌ఖైస్‌గేట్: ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ చదువుతున్న సమయంలో ఆదిలాబాద్‌కు చెందిన కేంద్రీ సోనీతాయ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పీజీ పూర్తి చేసిన రెండేళ్ల తర్వాత ఇద్దరం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఉద్యోగంలో చేరాం. ఇద్దరి కులం ఒక్కటైనా భాష వేరుకావడంతో పెళ్లికి పెద్దలు నిరాకరించారు. సెప్టెంబర్ 26, 2015న నిర్మల్ జిల్లా కేంద్రంలోని గండి రామన్న ఆలయంలో వివాహం చేసుకున్నాం. మేము చదివిన చదువు మాకు అండగా నిలిచింది. ప్రస్తుతం ఇద్దరం నిర్మల్‌లోనే లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాం. 2018లో పాప జన్మించింది. ఆ తర్వాత మా కుటుంబ సభ్యులు మా ప్రేమను అర్థం చేసుకొని మాతో కలిసిపోయారు.

– బలాస్ట్ శివరామకృష్ణ, కేంద్రీ సోనీతాయ్

ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొని..



తాంసి: తాంసి మండల కేంద్రానికి చెందిన రేండ్ల అజయ్, ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన అనూష హైదరాబాద్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న సమయంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. 2010లో వివాహం చేసుకున్నారు. ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటూనే చదువును పూర్తి చేశారు. అజయ్ ఎంబీఏ పూర్తి చేసి ఫార్మా కంపనీలో మార్కెటింగ్ ఉద్యోగంలో చేరాడు. రెండేళ్ల క్రితం అల్‌మైటి ఫార్మా కంపనీ ప్రారంభించాడు. అనూషను సైతం జీఎస్ఎం శిక్షణ పూర్తి చేయించడంతో హైదరాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో సీనియర్ నర్స్‌గా విధులు నిర్వర్తిస్తోంది. దీంతో ఆర్థిక కష్టాలు దూరమయ్యాయి. సమాజసేవలో సైతం ముందుండి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

– రేండ్ల అజయ్, అనూష

అలుపెరగని ప్రేమ



జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన మూల భాస్కర్‌గౌడ్, రేణుక ఇంటర్‌లోనే ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు ఒక్కటే అయినా వయస్సు రీత్యా మైనర్లు కావడంతో ఐదేళ్ల పాటు ఆగి ఆతర్వాత పెద్దలను ఒప్పించి 1980 ఫిబ్రవరి 14న వివాహం చేసుకున్నారు. దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ప్రేమించడమే కాకుండా పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నప్పుడే ఆ ప్రేమ చిరకాలం నిలుస్తుందని, తల్లిదండ్రులను బాధ పెట్టవద్దన్నది మా ఉద్దేశమని వారు పేర్కొంటున్నారు.

– భాస్కర్‌గౌడ్, రేణుక

పెద్దలను ఒప్పించి..



చెన్నూర్‌రూరల్: పట్టణంలోని మంగళి బజార్‌లో నివాసం ఉంటున్న కారెంగుల శ్రావణ్ పటేల్, మానసరాణి దంపతులది ప్రేమ వివాహం. 2011లో మానస కాలేజీకి వెళ్తుండగా చూసిన శ్రావణ్ ఆమెతో ప్రేమలో పడ్డాడు. సుమారు ఐదేళ్లపాటూ ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు కావడంతో యువతి ఇంటికి వెళ్లి పెద్దలతో మాట్లాడాడు. పెళ్లికి ఒప్పుకోవడంతో 2016లో వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఇద్దరు కుమారులు జన్మించారు. శావణ్ సోదరుడు సందీప్‌ది కూడా ప్రేమ వివాహమే. విజయ అనే యువతిని ప్రేమించి నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు.

– కారెంగుల శ్రావణ్, మానస రాణి

నమ్మకమైన బంధానికి ప్రతిరూపం



గుడిహత్నూర్: నమ్మకమైన బంధానికి ప్రతి రూపమే ప్రేమ అని.. ఇది లేకుండా మనిషి సంఘ జీవుడు కాలేడని చెప్తున్నారు ఉపారపు సత్యరాజ్–పార్వతి దంపతులు. మండలంలోని లింగాపూర్‌కు చెందిన సత్యరాజ్ 2017లో హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా అక్కడే పనిచేస్తున్న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని గోయగాంకు చెందిన కడతాల పార్వతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరుకావడంతో ఇరువురి పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో గతేడాది జనవరి 25న పెద్దలను ఎదిరించి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– సత్యరాజ్, పార్వతి

ప్రేమలో గెలిచి..



బోథ్: మండల కేంద్రానికి చెందిన కట్ట పల్లవి, భూమేశ్ దంపతులది ప్రేమ వివాహం. ఒకే కాలనీలో ఉంటున్న ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు నాలుగేళ్ల పాటు ప్రేమించుకున్నారు. ఇరువురి కులాలు వేరుకావడంతో పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో 2011లో తలమడుగు మండలం కజ్జర్ల శివారులోని శివాలయంలో స్నేహితుల మధ్య వివాహం చేసుకున్నారు. వివాహమైన వారం రోజులకే ఇరువురి కుటుంబసభ్యులు కలిసిపోయారు. అప్పటి నుంచి వారి దాంపత్యం అన్యోన్యంగా సాగుతోంది. ఏడాదూ వారి మధ్య భేదాభిప్రాయాలు రాలేదని దంపతులు పేర్కొంటున్నారు.

– కట్ట పల్లవి, భూమేశ్

తండ్రిని కొట్టాడన్న కక్షతోనే హత్య

- వీడిన హత్యకేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న డీసీపీ, ఏసీపీ

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ రాళ్లవాగులో ఈ నెల 7న అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన కేసును పోలీసులు ఛేదించారు. మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి పోలీసులు కేసు వివరాలు వెల్లడించారు. రాళ్లవాగులో మృతదేహంతో పాటు మోటార్‌బైక్ పడిఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని డీసీపీ సుధీర్ రాంనాథ్ కెకాన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, మందమర్రి సీఐ ప్రమోద్‌రావు, పట్టణ ఎస్ఐ అశోక్‌లు సందర్శించారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్యకు గురై ఉంటాడని భావించిన పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీఫుటేజీలో మృతుడితో పాటు మరికొందరు వ్యక్తులు హత్య జరిగిన ముందు రోజు రాత్రి అనుమానాస్పద స్థితిలో కనిపించడాన్ని గుర్తించిన పోలీసులు ఆ వ్యక్తులు ఎవరనే కోణంలో దర్యాప్తు సాగించారు.

తండ్రిని కొట్టాడన్న కక్షతోనే...

మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రం లాంజీ జిల్లా ఆవా అనే గ్రామానికి చెందిన కబిరే రాకేశ్ (24)గా గుర్తించారు. మృతుడు అదే ప్రాంతానికి చెందిన మిలింద్ రామ్‌టేకి, వికాస్ రాంటేకి, విశ్వాస్‌కుమార్‌లతో కలిసి సెంట్రింగ్ పనులు చేసేవాడు. నలుగురు కలిసి ఏడాది క్రితం కరీంనగర్‌లో పనిచేస్తున్న సమయంలో కొందరు బిల్డర్ల దగ్గర అందరికీ రావాల్సిన డబ్బులు రాకేశ్ ఒక్కడే తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయాడు. మిలింద్ తన తండ్రి ద్వారా రాకేశ్‌ను డబ్బులు గురించి అడిగించడంతో దాడికి పాల్పడ్డాడు. తన తండ్రిని కొట్టాడన్న కోపంతో రాకేశ్‌ను హతమార్చాలని ప్లాన్ వేశాడు. పని పేరిట ఈ నెల 5న మంచిర్యాలకు పిలిపించారు. పథకం ప్రకారం రాళ్లవాగు దగ్గరకు తీసుకువెళ్లి మద్యం తాగించి దాడికి పాల్పడ్డారు. అనంతరం నీటిలో ఊపిరాడకుండా చేసి హతమార్చారు. రాకేశ్ దొంగిలించిన బైక్‌ను ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహం పక్కనే ఉంచారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐ ప్రమోద్‌రావు, మందమర్రి సర్కిల్ ఎస్సైలు, సీసీఎస్ సిబ్బందిని డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కెకాన్ ప్రత్యేకంగా అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు

- ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో జనరల్ భీంరావ్

ఉట్నూర్(ఖానాపూర్): తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు 52 అర్జీలు అందజేశారు. తనకు గిరిజన వికాస పథకం ద్వారా తన పంటపొలంలో బోర్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని తిర్యాణి మండలం పంగిడిమాదరకు చెందిన సోయం లచ్చు, డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని భీంపూర్ మండలం ఇంద్రనగర్‌కు చెందిన అత్రం మీరాబాయి, అటవీహక్కు చట్టం ద్వారా సంక్రమించిన భూమిని తన పేరు మీద విరాసత్ చేయాలని భీంపూర్ మండలం బీరునందికి చెందిన బానవత్ కమలాబాయి, తన కుటుంబ పోషణ నిమిత్తం స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన రమేశ్, తాను కుట్టు శిక్షణ పొంది ఉన్నానని, టైలర్‌షాప్ పెట్టుకునేందుకు ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన జాదవ్ శ్యామల విన్నవించింది. కార్యక్రమంలో ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, పీవీటీజీ అధికారి భాస్కర్, డీపీవో ప్రవీణ్, ఓఎస్‌డీ కిష్టయ్య, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేయాలి



వీసీలో పాల్గొన్న జీఎం, అధికారులు

మందమర్రిరూరల్(చెన్నూర్): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ఏరియాలోని జీఎంలు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఆదేశించారు. ఆయా ఏరియాల్లోని జీఎంలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్య సాధనకు 47 రోజులే మిగిలి ఉందని, ప్రతిరోజు సింగరేణి వ్యాప్తంగా 2.3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సూచించారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, కళ్యాణిఖని, శాంతిఖని, కాసిపేట గ్రూపుల ఏజెంట్లు, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలపై డైరెక్టర్ల సమీక్ష

శ్రీరాంపూర్: కంపెనీ వార్షిక ఉత్పత్తి లక్ష్యాలపై సోమవారం డైరెక్టర్లు డైరెక్టర్లు ఎస్.బలరాం(పా, ఫైనాన్స్, డీ.సత్యనారాయణ(ఈఅండ్ఎం), కే.శ్రీనివాస్(ఆపరేషన్స్), జీ.వెంకటేశ్వర్‌రెడ్డి(పీపీ) కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి ఏరియాలో సాధిస్తున్న ఉత్పత్తి , బొగ్గు రవాణా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం చిరంజీవి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు



బాబాజీ (ఫైల్)



లింగయ్య (ఫైల్)

బెజ్జూర్(సిర్పూర్): బైక్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాపన్పేట గ్రామానికి చెందిన బుజాడి బాబాజి, తిక్కపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరి లింగయ్య (45), మహారాష్ట్రలోని జంబూగ గ్రామానికి చెందిన దందెర బాబాజీ (50) పెంచికల్‌పేట మండలంలోని బొంబాయిగూడలో తమ బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. రాత్రి భోజనం అనంతరం ముగ్గురు బైక్‌పై పాపన్పేటకు వస్తుండగా మర్తిడి బైపాస్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో లింగయ్య, బాబాజీలకు తీవ్రంగా బుజాడి బాబాజికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లింగయ్య, దందెర బాబాజీ ఆస్పత్రిలో మృతి చెందారు. మృతుడు లింగయ్య తండ్రి ఎల్లూరి బాబాజీ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్య విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే

కౌటాల: మండలంలోని గుడ్లబోరి గ్రామానికి చెందిన విద్యార్థిని చహరే కరిష్మాకు గతేడాది ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. సదరు విద్యార్థిని మెడిసిన్ చదువుకు ఆర్థిక స్తోమత లేక బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కరిష్మా ఎంబీబీఎస్ చదువుకు చేయూత అందిస్తానని హామి ఇచ్చారు. ఈ మేరకు రెండో దఫా కళాశాల ఫీజు రూ.1.70 లక్షల నగదును సోమవారం హైదరాబా ద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో నిరుపేద వి ద్యార్థిని తనవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపా రు. ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు మొత్తం ఫీజు చెల్లిస్తానని విద్యార్థినికి భరోసా ఇచ్చారు.

16 నుంచి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

నస్పూర్: శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో ఈ నెల 16 నుంచి 20 వరకు 41వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సెక్రటరీ ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి బాలురు 25 టీంలు, బాలికలు 25 టీంలు పాల్గొంటాయన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

6,098 మందికి కంటి పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 6,098 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దగ్గరి చూపు సమస్య ఉన్న వారిలో 1,303 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేశారు. సమస్య ఎక్కువగా ఉన్న వారిలో 1,167 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

మంచిర్యాలఅర్బన్: పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సెక్టోరల్ అధికారి పద్మజా సూచించారు. సోమవారం మంచిర్యాల కేజీబీవీలో పేరెంట్, టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల రంగోళి పోటీల్లో విజేతలైన వైష్ణవి, రవళిను అభినందించారు. స్పెషల్ ఆఫీసర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డ ఎండీ.అజిత్ పాషా వైద్య ఖర్చుల నిమిత్తం ఎస్టీపీపీ అధికారులు, సిబ్బంది నుంచి సేకరించిన రూ.1,60,500 లను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం సూర్యనారాయణ రాజు, పీసీఎస్ జీఎం వై.రాజశేఖర్‌రెడ్డి, ఏజీఎం సత్యనారాయణప్రసాద్, ఎస్‌వోటూ జీఎం కొండా వెంకటయ్య, పీఎం కేసా నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లిలో రే షన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీ సులు తెలిపారు. ఖర్జెల్లిలో తనిఖీ లు నిర్వహించగా జునుగరి శ్రీనివాస్ ఇంట్లో మహా రాష్ట్రకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 7 క్వింటాళ్ల బియ్యం లభ్యమయ్యాయి. బియ్యం స్వాధీనం చేసుకుని శ్రీనివా స్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్ తెలిపారు.

బీసీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నీల కంఠేశ్వర్‌రావు మాట్లాడుతూ రూ.2,90,396 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం 6,229 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. దీంతో బీసీలకు అన్యాయం జరుగుతుందని, బీసీల అభ్యున్నతికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కే.శ్రీనివాస్, ఎండీ ఖలీం, వేణుగోపాల్‌గౌడ్, రాజు, శ్రీకాంత్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

'దోభీ కాంట్రాక్టు రజకులకే కేటాయించాలి'

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ రంగ సంస్థల్లో దోభీ కాంట్రాక్టులను కేవలం రజకులకు మాత్రమే కేటాయించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో గల లయన్స్ భవన్‌లో సోమవారం రజకం సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బట్టలు ఉతికే కాంట్రాక్టు కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడం వల్ల రజకులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆయా కాంట్రాక్టులను రజకులకే కేటాయించేలా జీవో తీసుకు రావాలని కోరారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత ముక్కెర రాజేశంను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా కొలిపాక రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తంగళ్లపల్లి తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాసమల్ల కుమార్, పట్టణ అధ్యక్షుడిగా కటుకూరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా కొదురుపాక పోశం, ఉపాధ్యక్షులుగా చంద్రగిరి చంద్రమౌళిని నియమించారు. కార్యక్రమంలో తాడూరి శంకర్, అరటిపండ్ల శంకర్, పారిపల్లి మల్లయ్య, అన్నారం సత్యనారాయణ, కటుకూరి ముత్తయ్య, గుండ శంకర్, గుండ తిరుపతి, గుండ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.